## క్లుప్తంగా

### నేడు సెమిస్టర్ పరీక్షలు

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఈనెల 16న నిర్వహించాల్సిన డిగ్రీ సెమిస్టర్–3కి సంబంధించిన పరీక్షలను శనివారం నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

### నేటి నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశ్వస్వామి ఆలయంలో శనివారం నుంచి ఉత్సవాలు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అఖండ దీపారాధన కార్యక్రమాలతో పూజలు ప్రారంభమవుతాయి. 11గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం అఖండ భజనలు, 29న రథోత్సవం, పల్లకీసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు శ్రీనివాసచారి, కృష్ణాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### కొనసాగుతున్న రిలే దీక్షలు

**కోయిల్‌కొండ:** మండలంలోని గార్లపహాడ్ మండలంగా ప్రకటించాలని శుక్రవారం ఐదో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కేశ్వాపూర్‌కు చెందిన మండల సాధన సమితి జేఏసీ నాయకులు నరేష్, రామకృష్ణ, రవీందర్, బాలస్వామిలు పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్‌ను మండలం చేయడం ద్వారా చుట్టుపక్కల గ్రామాలు మరింత అభివృద్ధిచెందే అవకాశం ఉంటుందని వారు కోరారు.

### పశువైద్య శిబిరం



**బాలానగర్:** మండలంలోని సూరారంలో పశువైద్య శిబిరాన్ని ఏడీ శివానంద్ పరిశీలించారు. రైతులు పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, మండల పశువైద్య అధికారి రఘురాం తదితరులు ఉన్నారు.

**గండేడ్:** పశువులకు వచ్చే రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గండేడ్ పశువైద్యాధికారి రాంప్రసాద్, సర్పంచ్ వనజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బల్సూర్‌గొండలో పశువైద్య శిబిరం నిర్వహించారు.

### కల్యాణ మండపం ప్రారంభం



**అడ్డాకుల:** మండలంలోని రాచాలలో నిర్మించిన కల్యాణ మండపాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన గౌని చెన్నారెడ్డి రూ.2కోట్లతో గ్రామంలోని శ్రీచెన్నకేశస్వామి ఆలయం వద్ద కల్యాణ మండపాన్ని కట్టించారు. గౌని చెన్నారెడ్డిని ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, వైస్ ఎంపీపీ రాధిక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ చక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మార్మోగిన శివనామస్మరణ

**రాజాపూర్:** మండలంలోని రాయపల్లిలో శుక్రవారం గురుస్వామి వాసుదేవ్‌చారీ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ మహాపడిపూజ కార్యక్రమం కనులపండువగా నిర్వహించారు. పంచామృత అభిషేకాలు చేశారు. భక్తిగీతాలతో శివనామస్మరణ మారుమ్రోగింది. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

### మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీలదే



**కోయిల్‌కొండ:** హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ గ్రామ పంచాయతీ అధికారులదే బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ జయరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని దమాయపల్లిలో వాటరింగ్ డే సందర్భంగా పంచాయతీ అధికారులతో కలిసి మొక్కలకు నీరుపోశారు. కార్యక్రమంలో ఏపీఓ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### కందూర్‌లో పరీక్షపే చర్చ

**అడ్డాకుల:** మండలంలోని కందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ ఆధ్వర్యంలో పరీక్షపే చర్చా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు.

**డ్రాయింగ్ పరీక్ష..**

**మిడ్జిల్:** మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో, సేయింట్ మేరిస్ పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించారు.

# పేరుకే నో పార్కింగ్

● ఆటోలకు అడ్డాగా మారిన ముఖ్య కూడలి



లాన్ ఎదుట ఏర్పాటుచేసిన 'నో పార్కింగ్' బోర్డు



అశోక్‌టాకీస్ చౌరస్తా వద్ద నిలిపిన ఆటోలు, ఇతర వాహనాలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం మెయిన్ రోడ్డుపై పలుచోట్ల మున్సిపల్ అధికారులు పచ్చికబయలు (లాన్) ఏర్పాటు చేశారు. అయితే కొన్నిచోట్ల అవి ఆటోలకు అడ్డాగా మారాయి. ఇందుకు నిదర్శనం అశోక్ టాకీస్ చౌరస్తాలోని లాన్. ఇటీవల ఇక్కడి నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా బాటసారులు అక్కడ సేద తీరేందుకు చక్కటి పచ్చికబయలు ఉంది. ఏ వాహనాలు నిలపకుండా 'నో పార్కింగ్' బోర్డు సైతం పాతారు. అయితే అది కాస్తా ఆటో స్టాండ్‌గా మారింది. ముఖ్యకూడలి కావడంతో సమీపంలోనే బస్టాప్ ఉండటంతో ప్రయాణికులు దిగి ఈ లాన్‌లో కొద్దిసేపు ఉందామన్నా అందులోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఆ ప్రాంతం మొత్తం ఆటోలు, ఇతర వాహనాలు ఆపడంతో వారికి అసౌకర్యంగా తయారైంది. అక్కడ ట్రాఫిక్ పోలీసులు ఉన్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయమై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీఓ) శ్రీకాంత్‌ను వివరణ కోరగా అక్కడ ఏ వాహనాలు ఆపకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటోలు నిలపకుండా చూస్తామన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



పెద్దతండాలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

**మహమ్మదాబాద్:** బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులే ప్రజల్లో ఆదరణను పెంచుతాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని దేశాయపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్డు నిర్మాణం, ఆర్టీసీ బస్టాండ్ పునఃప్రారంభ తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అలాగే చౌదరపల్లి పెద్దతండాలో ఖాళీమాత విగ్రహ ప్రారంభం, హనుమాన్ ఆలయ నిర్మాణం, సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడేళ్లుగా ప్రజలకు చేసిన సేవ, అభివృద్ధి పనులే బీఆర్ఎస్ గెలుపుకు దోహదపడుతాయని తెలిపారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ దేశంలో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించబోతున్నదని అన్నారు. ఎన్నో పథకాల ద్వారా ప్రతి గడపకు సీఎం కేసీఆర్ ఎంతో మేలు చేకూర్చారని వెల్లడించారు. కార్యక్రమంలో దేశాయిపల్లి సర్పంచ్ రఘు, పెద్దతండా సర్పంచ్ శ్రీదేవి పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** మహబూబ్‌నగర్ అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ జిల్లా శాఖకు చెందిన క్యాలెండర్, డైరీలను శుక్రవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ ప్రతాప్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు రవిప్రకాష్, డైరెక్టర్లు రవీందర్‌నాయక్, కొండయ్య, మల్లికార్జున్, శ్రీనివాసులు, మురళీధర్, శ్రీహరి పాల్గొన్నారు.

**జడ్చర్ల:** బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం ఏఐటీయూసీ క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆవిష్కరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షతుల్లా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజు, శ్రీనివాసులు, శివ, వినయ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ధర్నా



దేవరకద్రలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

**దేవరకద్ర:** అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు నుంచి అంగన్‌వాడీ వర్కర్స్ ర్యాలీగా బయలు దేరి సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని కోరారు. టీచర్లతో సమానంగా అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అనంతరం సీడీపీఓ శైలశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవమ్మ, సులోచన, ప్రతినిధులు గోవిందమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**జడ్చర్ల:** అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. గురువారం సమస్యల పరిష్కారం కోరుతు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు సరోజ, లీలావతి, రాజ్యలక్ష్మి, గౌసియాబేగం, పద్మ, మహేశ్వరి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

### ఐటీసెల్ కన్వీనర్‌గా అవినాష్



**పాలమూరు:** మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఐటీ అండ్ సోషల్ మీడియా కన్వీనర్‌గా బాలానగర్‌కు చెందిన బిజ్జుల అవినాష్‌ను నియామిస్తూ శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటరమణ నియామకత్రం అందించారు.

### కోఆర్డినేటర్ రవిప్రకాశ్



**స్టేషన్ మహబూబ్‌నగర్:** వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు వైఎస్సార్ విగ్రహాల పరిరక్షణ కమిటీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన ఆర్.రవిప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రవిప్రకాశ్‌ను నియమిస్తూ వైఎస్సార్ విగ్రహాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు నీలం రమేశ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### అధిక లాభాలు పొందాలి

**నవాబుపేట:** రైతులు పంటలు పండించటంతో పాటు వాటిని ప్రాసెసింగ్ చేయడంలో భాగస్వాములై అధిక లాభాలు పొందాలని ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు డైరెక్టర్ శివరాంప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో సర్పంచ్ రాఘవేందర్ అధ్యక్షతన రైతులకు పండ్లు, కూరగాయలు తదితర వాటి ప్రాసెసింగ్ యూనిట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆహార ఉత్పత్తుల పంటలు పండిచటంతోనే కాకుండా వాటిని ప్రాసెసింగ్‌లో భాగస్వాములను చేసేలా కావాల్సిన శిక్షణ తదిరత ఏర్పాటు చేసే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు శర్మ, రాజ్‌కుమార్, రైతు సహకార సంఘం చైర్మన్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ చందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీకి పతనం తప్పదు

**మహబూబ్‌నగర్ రూరల్:** ఎస్సీ వర్గీకరణపై నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్న బీజేపీకి ఎన్నికల్లో పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ క్రమశిక్షణ కమిటీ నాయకుడు రాగాటి సత్యం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి తెలపాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులపై బీజేపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని ఖండించారు.

### రాష్ట్ర కన్వీనర్‌గా పీర్ సాధిక్





**స్టేషన్ మహబూబ్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన పీర్ మహ్మద్ సాధిక్ నియామకం అయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు జహీర్ అఖ్తర్‌లు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు వసంత, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఖాజా అజ్మత్‌అలీ, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్, సిరాజ్ ఖాద్రీ, మహ్మద్ అవేజ్, జహీర్ పాల్గొన్నారు.

### కాశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలి

**పాలమూరు:** గవర్నర్‌కు ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ డిమాండ్ చేశారు. పాలమూరు మహిళ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. అనంతరం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, రాజ్యాంగబద్ధంగా నియమితులైన గవర్నర్‌ను ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కించపరుస్తూ మట్లాడటం సరికాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంజయ్య, నారాయణ, యాదమ్మ, నాగరాజు, మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



**చిన్నచింతకుంట:** పదోన్నతులను కల్పించాలని తెలుగు భాష పండితుడు పాల్ సుధాకర్ డిమాండ్ చేశారు. తెలుగు భాష పండితులకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమలేకర్ శ్యామ్ ప్రసాద్‌రావు, రాంచంద్రయ్య, రామోహన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, జయరాం, అంజిలయ్య, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కంటివెలుగు పరిశీలన

**బాలానగర్:** మండలంలోని చిన్నరేవల్లిలో శుక్రవారం జరిగిన కంటి వెలుగు కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఆర్ఐ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



బాలిక కంటి అద్దాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. స్థానిక శివశక్తినగర్‌లో 'కంటివెలుగు' కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పాత పాలమూరుకు చెందిన దోబీఘాట్ వాసి మహేష్‌చారి రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లను, అలాగే తండ్రి సత్యనారాయణచారిని కోల్పోయి ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నట్లు వాపోయాడు. స్పందించిన మంత్రి వెంటనే మహేష్‌చారికి మూడు చక్రాల వాహనాన్ని, విద్యార్హతలను బట్టి ఉద్యోగాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎనుగొండలోని పోచమ్మ ఆలయం వద్ద రూ.15లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అలాగే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరయ్యారు.

**క్రీడాకారులకు అభినందన..**

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** ఇటీవల జరిగిన నేషనల్ స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబర్చిన మైనార్టీ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్ట్యూట్ సొసైటీ విద్యార్థులను కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో క్రీడాకారులను అభినందించారు.

**డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ..**

**పాలమూరు:** జిల్లా న్యాయవాదుల మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్‌కు సంబంధించిన 2023 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ప్రతాప్ కుమార్, అధ్యక్షుడు రవిప్రకాష్, డైరెక్టర్లు రవీందర్ నాయక్, కొండయ్య, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

**భవనం కేటాయించాలని వినతి..**

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘానికి భవనం కోసం భూమిని కేటాయించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సంఘం నాయకులు విన్నవించారు.

**నియామక పత్రాలు అందజేత..**

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంఎల్‌హెచ్‌పీలుగా నియమితులైన 53 మందికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కలెక్టర్ వెంకట్రావ్ తోకలిసి అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు.

## ఉన్నత లక్ష్యాలు సాధించాలి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

**గండేడ్:** విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నదే తమ సంకల్పమని బీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గండేడ్, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, బల్సూర్‌గొండ, చిన్నవార్వాల్ గ్రామాల్లోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, ఆర్ఎస్ఎస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, సర్పంచ్‌లు చంద్రకళ, జితేందర్‌రెడ్డి, వనజా, ఎంపీటీసీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఖాళీమాత విగ్రహ ప్రతిష్ఠాపన..**

మహమ్మదాబాద్: దేశంలో అభివృద్ధిలో అగ్రస్థానంలో తెలంగాణ ఉన్నదని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దతండాలో ఖాళీమాత విగ్రహప్రతిష్ఠాపన, హనుమాన్ ఆలయ నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, దేవిజానాయక్ ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీలో గల శ్రీపంచముఖి ఆంజనేయస్వామి ఆలయం 19వ వార్షికోత్స వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయస్వామి వారికి అష్టోతర శత క్షీరాభిషేకం, మన్యు పాశుపత హోమం, సాయంత్రం నవగ్రహ హోమం, కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి సువర్చలా సహిత ఆంజనేయస్వామి వారి కల్యాణోత్సవం, మహా మంగళహారతి పూజలు చేశారు. శనివారం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి వారికి అభిషేకం, మహాసుదర్శన హోమం పూజలు నిర్వహించనుమని, సాయంత్రం 6 గంటలకు భక్తి భజన బృందంచే కోలాటాల కార్యక్రమాలు ఉంటుందని తెలిపారు.

**లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు..**

జిల్లా కేంద్రం సింహగిరిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి తృతీయ పుష్కర ప్రయుక్త 36వ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం హోమం, మూల మంత్ర జపం, తర్పణం తదితర పూజలు నిర్వహించారు.

### ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



**అడ్డాకుల:** మండలంలోని వర్నె వద్ద వాగులో ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇతర మండలాల్లో జరిగే ప్రభుత్వ పనులకు ఇక్కడి వాగు నుంచి ఇసుకను ఎలా తరలిస్తారని ప్రశ్నిస్తూ గ్రామస్తులు ఇసుక టిప్పర్లను అడ్డగించి ఆందోళనకు దిగారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని నెల్విడి, నర్సింగాపురం గ్రామాల్లో చేపడుతున్న ప్రభుత్వ పనులకు వర్నె వద్ద ఉన్న వాగు నుంచి ఇసుక తరలించేలా జిల్లా ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం వాగులోకి వెళ్లిన ఇసుక టిప్పర్లు ఇసుకను నింపుకుని వెళ్తుండగా, స్థానిక సర్పంచ్ బంగారయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రామంలో అడ్డగించారు. స్థానిక వాగులో ఇసుకను తరలిస్తే బోరుబావులు ఎండిపోయి పంటలపై ప్రభావం పడుతుందని వాపోయారు. సమాచారం అందుకున్న గిర్దావర్ సాహత్ ఇషాన్ గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వ పనులకు అనుమతి ఉన్నందున వాహనాలను అడ్డగించొద్దని గ్రామస్తులకు నచ్చజెప్పారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

### ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యకు డిమాండ్

**మహబూబ్‌నగర్ రూరల్:** హన్వాడ మండల కేంద్రానికి చెందిన బ్యాగరి కృష్ణయ్య, అంజమ్మ దంపతుల చిన్న కుమారుడు శ్రీను మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి శ్రీను మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్‌లో గల మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. మూడు రోజుల కిందట పాఠశాల భవనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడని పేర్కొన్నారు. విద్యార్థి శ్రీను మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, విద్యార్థి మృతికి పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

### వివరాల నమోదు తప్పనిసరి

**గండేడ్:** ఎరువుల దుకాణాలకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పూర్తిస్థాయిలో పొందుపర్చాలని మండల వ్యవసాయాధికారి ఫనీషా పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణదారులకు ఆన్‌లైన్ లైసెన్స్ మెనేజ్‌మెంట్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం దుకాణాలకు సంబంధించిన స్టాకు, బిల్ పుస్తకాలు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల దుకాణాలకు సంబంధించి కొత్త వర్షన్ అందుబాటులోకి వచ్చిందని, దాని ప్రకారం వివరాలు నమోదు చేయాలన్నారు. ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.